ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

● జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి ప్రదీప్

రామన్నపేట, ఏప్రిల్10 : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడుకొని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని రామన్నపేట మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యాధి సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కుటుంబ యజమాని అనారోగ్యంతో ఆ కుటుంబం మొత్తం ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి పోతుందన్నారు. తద్వారా దేశ ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుందన్నారు.

ప్రతి ఒక్కరూ దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా దవాఖాన సూపరింటెండెంట్ వీరన్నను సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంఏ మజీద్, సీనియర్ న్యాయవాదులు నరేందర్‌రావు, జినుకల ప్రభాకర్, మామిడి వెంకట్‌రెడ్డి, మొగిలయ్య, దినేశ్, బాలరాజు, రమేశ్, వైద్యులు శ్వేతప్రియాంక, మాధవాచారి, అంకిత, లింగాయాదవ్, ముఖీత్, నర్సింగ్, సూపరింటెండెంట్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

జానపద కళల పరిరక్షణ సేవా సమితి వార్షికోత్సవం

బాలనాగమ్మ నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

చౌటుప్పల్, ఏప్రిల్ 10 : చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో జానపద కళల పరిరక్షణ సేవా సమితి తొమ్మిదో వార్షికోత్సవ వేడుకలను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బాలనాగమ్మ యక్షగాన నాటకాన్ని ప్రదర్శించారు. అంతరించిపోతున్న కళలకు జీవం పోసేందుకే ఈ సేవా సమితిని స్థాపించి ప్రతి ఏటా యక్షగాన కళలను ప్రదర్శిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ముప్పిడి సైదులుగౌడ్, పోలోజు శ్రీధర్‌బాబు, ఎరుకుల మల్లేశంగౌడ్, చిక్క నర్సింహ, కొండూర్ వెంకన్నగౌడ్, దొడ్డి రాములు, వెంకటేశం పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రాజాపేట, ఏప్రిల్ 10 : మండలంలోని రఘునాథపురంలో మహిళా సంఘ బంధం ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ మహిళా సంఘ బంధం సభ్యులు మంత్రి పుష్ప, శ్రీరాముల మహాలక్ష్మి, కలకుంట్ల కవిత, రాపోలు నర్మద, ఆడెపు భాగ్యలక్ష్మి, వీఏఓలు మిట్ట శ్రీనివాసులు, పొట్టబత్తిని వెంకటలక్ష్మి, మార్క శారద పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని బస్ స్టాండ్ ఆవరణలో బాలాజీ షాపింగ్ మాల్ నిర్వాహకులు చలివేంద్రాన్ని ప్రారంభించారు. మొదటి రోజు మజ్జిగను అందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు ఎంవీ చారి, ఆనంద్‌రావు, రామచంద్రం, దాతలు కృష్ణారాం చౌదరి, రాజేశ్ పాల్గొన్నారు.

రాజాపేట : చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మహిళా సంఘ బంధం సభ్యులు

సింగిల్‌విండో చైర్మన్‌గా దామోదర్‌రెడ్డి

● కోర్టు ఆదేశాల మేరకు తిరిగి బాధ్యతల స్వీకరణ

సింగిల్‌విండో చైర్మన్‌గా తిరిగి బాధ్యతలు స్వీకరిస్తున్న చింతల దామోదర్‌రెడ్డి

చౌటుప్పల్, ఏప్రిల్ 10 : చౌటుప్పల్ మండల సింగిల్‌విండో చైర్మన్‌గా చింతల దామోదర్‌రెడ్డి బుధవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. పీఏసీఎస్ గోదాం నిర్మాణం, కార్యాలయ సిబ్బంది నియామకాలపై సహకార చట్టం నిబంధనలు ప్రటించకుండా చేశారనే ఫిర్యాదుల మేరకు గత మార్చి 2న డీసీఓ ప్రవీణ్‌కుమార్ తొలగింపు ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో వైస్ చైర్మన్‌గా ఉన్న చెన్నగోని అంజయ్యగౌడ్‌కు చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో దామోదర్ రెడ్డి ట్రిబ్యునల్ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు ఆయన తిరిగి బాధ్యతలు స్వీకరించారు.

నల్లగొండ ఎన్‌జీ కళాశాలలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

14న సాహిత్య సమాలోచన

రామగిరి, ఏప్రిల్10, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి సాహిత్య సమాలోచన సదస్సు ఈ నెల 14న నల్లగొండలోని ఎన్‌జీ కళాశాలలో సృజన సాహితీ ఆధ్వర్యంలో జరుగనుందని నాగార్జున ప్రభుత్వ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు తండు కృష్ణ కౌండిన్య తెలిపారు. ఎన్‌జీ కళాశాల ఆవరణలో బుధవారం సదస్సు పోస్టర్ ఆవిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఏనుగు నరసింహారెడ్డి మూడు దశాబ్దాలకు పైగా తెలుగు సాహిత్యంలో చేస్తున్న కృషిని ఈ సదస్సు ప్రతిబింబిస్తుందన్నారు. సృజన సాహితీ అధ్యక్షుడు పెరుమాళ్ల ఆనంద్ మాట్లాడుతూ కవులు, సాహితీవేత్తలు, సాహిత్య విద్యార్థులు, పరిశోధకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సాహితీవేత్తలు మాదగాని శంకరయ్య, సాగర్ల సత్తయ్య, బండారు శంకర్, సిలివేరు లింగమూర్తి, దాసోజు జ్ఞానేశ్వర్, యర్ర దేవదానం, దాసోజు రవికుమార్, ఇసురాజు సైదులు పాల్గొన్నారు.

యాదగిరీశుడికి నిత్యోత్సవాలు



స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 10 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్ల నిత్యోత్సవాలు వైభవంగా జరిగాయి. బుధవారం తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో నారసింహులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులకసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. సాయంత్రం స్వామివారికి తిరువీధి, దర్బార్ సేవలను చేపట్టారు. రాత్రి స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపించారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు జరిగాయి. సుమారు 12 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఆలయ ఖజానాకు రూ.27,43,764 ఆదాయం సమకూరిందని ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

వైభవంగా వసంత నవరాత్రోత్సవాలు..

ఆలయ అనుబంధ పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో సీతారామచంద్రస్వామి వసంత నవరాత్రోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం రెండో రోజు యాగమండపంలో ఉదయం సీతారామ హనుమత్ మూలమంత్ర జపాలు, దశశాంతి పంచసూక్త పారాయణాలతో అభిషేకం, ఆధ్యాత్మరామాయణ పారాయణం, సీతారామ హనుమత్ మూర్తులకు అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. సాయంత్రం సీతారామ హనుమత్ మూర్తులకు సహస్రనామార్చనలు, నివేదన, నీరాజన మంత్ర పుష్పాలు జరిపి తీర్థ ప్రసాదాల వితరణ గావించారు. కొండపైన ఈఓ భాస్కర్‌రావు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ప్రసాద విక్రయశాలకు చేరుకుని తయారీని పరిశీలించి, శుచి, శుభ్రతకు చేపడుతున్న పనులకు అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, డీఈఓ భాస్కర్ శర్మ, ఏఈఓ జూశెట్టి కృష్ణ, పర్యవేక్షకులు చంద్రమౌళి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వారినే గెలిపించాలి

● సీపీఐ(ఎం) భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్

సమావేశంలో మాట్లాడుతున్న జహంగీర్

అడ్డగూడూరు, ఏప్రిల్ 10 : సమస్యల పరిష్కారానికి కృషి చేసే వారినే భువనగిరి ఎంపీగా గెలిపించాలని సీపీఐ(ఎం) భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ జహంగీర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూసీని శుద్ధి చేసి స్వచ్ఛమైన నీటిని అందజేయాలని డిమాండ్ చేశారు. కొంతమంది పదవుల కోసం పోటీ చేస్తున్నారని, తాను మాత్రం ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోటీ చేస్తున్నానని తెలిపారు. బునాదిగాని కాల్వ ఏర్పాటుకు కోసం పోరాడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుర్ర అనిల్‌కుమార్, నాయకులు ఆనగంటి వెంకటేశ్, బొల్లు యాదగిరి, వల్లంభట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరకట్నం కేసులో ముగ్గురికి పదేండ్ల జైలు

సంస్థాన్‌నారాయణపురం, ఏప్రిల్ 10 : వరకట్నం వేధింపులు తాళలేక షేక్ అస్మా అనే వివాహిత ఆత్మహత్య చేసుకోవడంతో అందుకు కారణమైన ముగ్గురికి 10ఏండ్ల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా మొదటి అడిషనల్ సెషన్స్ జడ్జి మారుతిదేవి మంగళవారం తీర్పు వెల్లడించారు. ఎస్ఐ జగన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండంలోని గుడిమాల్కాపురం గ్రామానికి చెందిన సయ్యద్ అస్మాకు అదే మండంలోని జనగాం గ్రామానికి చెందిన సయ్యద్ షరీఫ్‌తో 2018 డిసెంబర్‌లో వివాహం జరిగింది. ఆ తర్వాత భర్త, అత్త, మామల వరకట్నం వేధింపులు తాళలేక సయ్యద్ అస్మా 29 జూన్ 2019లో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సంస్థాన్ నారాయణపురం పోలీస్ స్టేషన్‌లో భర్త సయ్యద్ ఫరీఫ్, మామ సయ్యద్ మౌలనా, అత్త సయ్యద్ ఫాతిమా బేగంపై కేసు నమోదు చేశారు. వాదోపవాదనల అనంతరం కేసు రుజువు కావడంతో ఐపీసీ సెక్షన్ 498(ఏ), 304(బీ) ప్రకారం ముగ్గురిని కోర్టు దోషులుగా నిర్ధారించి శిక్ష ఖరారు చేసినట్లు ఎస్ఐ జగన్ తెలిపారు.

యాదగిరిగుట్ట దేవస్థానం ధర్మకర్తల మండలి ఏర్పాటుకు సన్నాహాలు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 10 : యాదగిరిగుట్ట దేవస్థాన ధర్మకర్తల మండలి ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. చైర్మన్, 8 మంది డైరెక్టర్లతో కూడిన మండలి ఏర్పాటుకు విధివిధానాలు దాదాపు పూర్తికావచ్చాయి. పార్లమెంట్ ఎన్నికల అనంతరం జూన్ మొదటి వారంలో మండలి ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. 2010లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ధర్మకర్తల మండలి చైర్మన్‌గా అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, డైరెక్టర్లుగా యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన పెలిమెల్లి శ్రీధర్‌గౌడ్, గుంటుకింది భాగ్యమ్మ(బీబీనగర్), దారెడ్డి వేణుగోపాల్‌రెడ్డి(పోచంపల్లి), దాసోజు సత్యనారాయణచారి(నల్లగొండ), వెంపటి సురేశ్(సూర్యాపేట), పగడాల ప్రభాకర్‌రెడ్డి(కోదాడ), రాజ్‌కుమార్(హైదరాబాద్), రాజేందర్(కరీంనగర్)ను నియమించారు. 2014లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం అప్పటి సీఎం కేసీఆర్ వైటీడీఏను ఏర్పాటు చేసి యాదగిరిగుట్ట దేవస్థానాన్ని మహాద్భుతంగా తీర్చిదిద్దారు. అప్పటి నుంచి ధర్మకర్తల మండలి ఏర్పాటు కాలేదు. తాజాగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం ధర్మకర్తల మండలి ఏర్పాటుపై దృష్టి సారించింది. ధర్మకర్తల మండలి ఏర్పాటులో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం ఉండాల్సి ఉండగా.. అప్పట్లో కేవలం ఉమ్మడి నల్లగొండ జిల్లాకే అధిక ప్రాతినిధ్యం కల్పించారు.

నెమిలెలో పార్శ్వనాథుడి శిల్పం

● గుర్తించిన కొత్త తెలంగాణ చారిత్రక బృందం సభ్యుడు గణేశ్

పార్శ్వనాథుడి శిల్పం

రాజాపేట, ఏప్రిల్ 10 : మండలంలోని నెమిలె గ్రామంలోని హనుమాన్ ఆలయ సమీపంలో జైన ధర్మానికి చెందిన 23వ జైన తీర్థంకరుడు పార్శ్వనాథుడి విగ్రహ శకలాన్ని బుధవారం కొత్త తెలంగాణ చారిత్రక బృందం సభ్యుడు గణేశ్ కుండే గుర్తించారు. జైన తీర్థంకరుడైన నేమినాథుడి పేరు మీద వెలసిన నెమిలెలో ఒకప్పుడు జైన బసదులతో అలరారేదని తెలిపారు. కొలనుపాక, రఘునాథపురం, సైదాపురం, కొల్లూరు గ్రామాల్లో లభించిన జైన తీర్థంకరుల శిల్పాలే దీనికి సాక్షాలుగా నిలిచాయన్నారు. నెమిలె గ్రామంలో వెలుగులోకి వచ్చిన పార్శ్వనాథుడి శిల్పం జైన బసదిలా ఉండేదని చెప్పుకొచ్చారు. కాయోత్సర్గ భంగిమలో ఆజానుబాహుడైన శిల్పం వెనుక చుట్టలు తిరిగిన ఏడుతలల సర్పం ఉన్న శిల్పం రాష్ట్ర కూట శైలిలో చెక్కబడిందని చెప్పారు. ఇలాంటి శిల్పాలు కన్పించడంతో మరోసారి జైనధర్మం జాడలు వెలుగులోకి వస్తున్నాయని తెలిపారు.

ఉత్తమ సేవలకు అవార్డులు

నకరేకల్, ఏప్రిల్ 10 : లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320-ఈ ఉత్తమ సేవలకు అవార్డు పంపిణీ హైదరాబాద్‌లోని హయత్‌నగర్ పద్మావతి ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించినందుకుగానూ లయన్స్ క్లబ్ నకిరేకల్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ, సెక్రటరీ అండెం వెంకటేశ్వర్లు, కోశాధికారి వరకాంతం నారాయణరెడ్డికి రీజియన్ అవార్డుల ప్రదానోత్సవంలో అవార్డులు అందజేశారు. వీరికి అవార్డులు అందజేయడంపై క్లబ్ రీజియన్ చైర్మన్ బచ్చుపల్లి రవీందర్‌రావు, జోన్ చైర్మన్ రావిరాల అశోక్, రేపాల సతీశ్, డిస్ట్రిక్ట్ చైర్మన్లు శంభులింగారెడ్డి, యాదగిరిరెడ్డి, కృష్ణమూర్తి, క్లబ్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

రాజాపేట శివాలయంలో ధ్వజారోహణం

రాజాపేట, ఏప్రిల్ 10 : మండల కేంద్రంలోని శివాలయంలో నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా బుధవారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అఖండ దీపారాధన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ప్రతిష్ఠ విగ్రహాల శోభాయాత్ర నిర్వహించగా మహిళలు పెద్దఎత్తున మంగళహారుతులతో స్వాగతం పలికారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి హెల్ప్‌లైన్ నంబర్

● మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 10 : తాగునీటి సమస్య పరిష్కారం కోసం మున్సిపాలిటీ కార్యాలయంలో హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కె.వీరారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు నీటిని వృథా చేయకుండా వాడుకోవాలని సూచించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని కార్యాలయంలో టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. తాగునీటి సరఫరాలో సమస్యలు ఉన్నవారు 8125552012, 9948654763 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్10 : మండల కేంద్రానికి చెందిన కోలెపాక సత్తెమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం మృతురాలి కుటుంబానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ రూ.5 వేల ఆర్థికసాయం అందజేసి సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఎంపీటీసీ యాస కవిత, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కోరె వెంకన్న, జిల్లా నాయకులు భిక్షపతి, దశరథ గౌడ్, నాతి రాజు, ఏలేందర్, హైమద్, సత్యనారాయణ, అజీమొద్దీన్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర ఆలయ కమిటీ డైరెక్టర్ల నియామకం

విజయ్

నవీన్

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్10 : మండల కేంద్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ డైరెక్టర్లుగా బీఆర్ఎస్‌కు చెందిన ఎలగందుల విజయ్, కదిరె నవీన్‌ను బుధవారం నియమించినట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు కోరె వెంకన్న తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ నియామకానికి సహకరించిన బీఆర్ఎస్ నాయకులు, గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, అఖిలపక్ష నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్10 : మండలంలోని ఉప్పలపహాడ్‌కు చెందిన జిట్ట శ్రీశైలం తన పశువులను మేత కోసం తోలుకుపోతుండగా మార్గమధ్యంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలిన ఎద్దు మృతి చెందింది. రూ.40 వేల విలువైన ఎద్దు మృతితో ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న వైటీడీఏ ఆర్ట్ డైరెక్టర్ ఆనందసాయి, ఈఓ భాస్కర్‌రావు

గుట్టపైన బ్రహ్మోత్సవ మండపం వద్ద డిజిటల్ స్క్రీనింగ్

● స్థలాన్ని పరిశీలించిన ఆర్ట్ డైరెక్టర్ ఆనందసాయి, ఈఓ భాస్కర్‌రావు

యాదగిరిగుట్ట, ఏప్రిల్10 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో స్వామివారికి జరిగే నిత్యరాధనలు, పూజలు మాఢవీధుల్లో ఉన్న భక్తులకు కనిపించేలా తూర్పు మాఢవీధుల్లో డిజిటల్ స్క్రీనింగ్‌తోపాటు, ఈశాన్య ప్రాంతంలో తాత్కాలిక సాంస్కృతిక వేదిక, రూ.150 దర్శనానికి కావాల్సిన ప్రత్యేక మెట్లు, లిఫ్టు ఏర్పాట్లకు కావాల్సిన స్థలాన్ని వైటీడీఏ ఆర్ట్ డైరెక్టర్ ఆనందసాయి, ఈఓ భాస్కర్‌రావు బుధవారం పరిశీలించారు. కొండపైన బ్రహ్మోత్సవ మండపం వద్ద డిజిటల్ స్క్రీనింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి శుక్ర, శని, ఆదివారాల్లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు మాఢవీధుల్లోని ఈశాన్య ప్రాంతంలో శివాలయానికి వెళ్లే మార్గం పక్కన తాత్కాలిక సాంస్కృతిక వేదిక నిర్మించనున్నారు. రూ.150 దర్శనానికి వీఐపీ పార్కింగ్ వద్ద టికెట్ కౌంటర్ వద్ద నుంచి రథశాల వరకు ప్రత్యేక మెట్లతోపాటు లిఫ్టు నిర్మించనున్నారు. వికలాంగులు, గర్భిణులు, ఏడాది లోపు చిన్నారి తల్లిదండ్రులు, వృద్ధులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేక దర్శనానికి తీసుకెళ్లేలా బస్టాండ్ వద్ద క్యూ కాంప్లెక్స్ వద్ద హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయనుండగా, ఇందుకు కావాల్సిన స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఆలయ సివిల్ ఈఈలు దయాకర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఏఓ జగన్‌మోహన్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రైతాంగ సమస్యలను పరిష్కరించాలి

● ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 10 : రాష్ట్రంలో నెలకొన్న రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్)ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన పంట అకాల వర్షాలు, ఈదురు గాలులతో నేలమట్టమైన రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. అలాగే పండించిన పంటకు మద్దతు ధర ఇవ్వాలని, దళారుల నుంచి రైతులను కాపాడాలని డిమాండ్ చేశారు. రైతుబంధు నిజమైన రైతులకు అందేలా చర్యలు తీసుకొని రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని కోరారు. పంటలకు బీమా సంరక్షణ కల్పించి రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. బ్యాంక్ రుణాలు మాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. అధికారంలోకి వచ్చే ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి జగన్‌మోహన్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మామిడాల సోమయ్య, కళ్లెపు అడవయ్య, నాయకులు నేరెడు స్వామి, మామిడాల బాలమల్లేశ్, ఇక్కిరి సహదేవ్, భూష శ్రీశైలం, సిద్దేశ్వర్, టంగుటూరు మాజీ సర్పంచ్ కట్టా సమరసింహారెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్నఐద్వా జిల్లా కార్యదర్శి అనూరాధ

ప్రధానోపాధ్యాయుడిని సర్వీస్ నుంచి తొలగించాలి

● ఐద్వా జిల్లా కార్యదర్శి అనూరాధ

గుండాల, ఏప్రిల్ 10 : మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడు అండెం మాధవరెడ్డిని సర్వీస్ నుంచి తొలగించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనూరాధ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆమె సీపీఎం మండల కార్యదర్శి మద్దెపురం రాజుతో కలిసి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతి పాఠశాలలో స్నేహిత కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించాలన్నారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలని ఆమె కోరారు. ఆమె వెంట సీపీఎం మండల కమిటీ సభ్యులు పోతరబోయిన సత్యనారాయణ, ఎండీ ఖలీల్, బత్తిని భిక్షం ఉన్నారు.

మోత్కూరు : గుండాల మండల కేంద్రంలో విద్యార్థులపై వికృత చేష్టలకు పాల్పడిన ఉపాధ్యాయుడు మాధవరెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల శాంతికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించడం సిగ్గు చేటన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉపాధ్యాయుడిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రంజాన్ కానుకల పంపిణీ

భువనగిరి కలెక్టరేట్ : కానుకలు అందజేస్తున్న సింగిల్‌విండో మాజీ చైర్మన్ సతిరెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 10 : రంజాన్ పురస్కరించుకుని మండలంలోని బీఎన్ తిమ్మాపురంలో ముస్లిం కుటుంబాలకు భువనగిరి సింగిల్‌విండో మాజీ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి నిత్యావసర సరుకులు, నూతన వస్త్రాలను అందజేసి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్‌ను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉడుత శారదాఆంజనేయులు, బీఆర్ఎస్ గ్రామ శాఖ యూత్ అధ్యక్షుడు ఎండీ బాబా, గ్రామశాఖ అధ్యక్షుడు డొంకెన ప్రభాకర్ గౌడ్, పాల సంఘం మాజీ చైర్మన్ జిన్న నర్సింహ, వెంకటేశ్, పాండు, శ్రీశైలం, అశోక్, మహిపాల్, భిక్షపతి, సత్తయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని మసీదులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశం, కిసాన్ సెల్ జిల